విశాలాంధ్ర అనంతపురం

www.visalaandhra.com

కర్నూలు, మంగళవారం 26, డిసెంబర్ 2023

జీబీసీకి సాగునీరు కొనసాగించాలి..

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జీబీసీకి సాగునీరు జనవరి ఆఖరి వరకు కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. నీలం రాజశేఖర్ రెడ్డి భవన్, సిపిఐ జిల్లా కార్యాలయం నందు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సి. జాఫర్ మాట్లాడుతూ హంద్రీనీవా-సుజలస్రవంతి- సూపరింటెండెంట్ ఇంజనీరింగ్‌కు అనంత జిల్లాలో కరువు తాండవిస్తున్నది అన్నం పెట్టే రైతులు వలసలు పోతున్నారు అనే విషయాన్ని తెలియజేయడం జరిగిందన్నారు. 31 మండలాలకు గాను 28 మండలాలు కరువుగా ప్రకటించారు. బెలుగుప్ప బొమ్మనహాలు ఎల్లనూరు మండలాలు కరువుగా ప్రకటించాలని కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. నవంబర్12 వ తారీకు కేంద్ర కరువు బృందాలు 11 మంది ఐఏఎస్ ఆఫీసర్లు టీం లీడర్, పంకజ్ యాదవ్ ఆధ్వర్యంలో అనంతపురము, సత్యసాయి జిల్లాల్లో పంటల పరిస్థితిని అధ్యయనం చేయడానికి రావడం జరిగింది అన్నారు. తూతూ మంత్రంగా ఎంపిక చేసిన రెండు, మూడు గ్రామాలు పర్యటన చేశారు. కానీ రైతులను ఆదుకోవడానికి ఎటువంటి ప్రతిపాదనలు పంపారు. ఎటువంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న విషయం రైతులకు, ప్రజలకు అర్థం కావడం లేదు అన్నారు. అంతేకాకుండా గోరుచుట్టుపై రోకటి పోటులాగా తుంగభద్ర నుండి రావలసిన నీరు32.5 టీఎంసీలు, మన కోట రాకపోగా ఉన్నపలంగా నవంబర్ మాసంలోనే నీరు బంద్ చేశారు. ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలంలో గుంతకల్ బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు కింద ప్రభుత్వ లెక్కల ప్రకారం 26 వేల ఎకరాలలో మిర్చి రైతులు సాగు చేశారని ప్రభుత్వం అధికారికంగా తెలియజేసింది. అయితే ఇంకా అధికారులకు లెక్కలకు అందని నాలుగువేల ఎకరాల మిర్చి రైతులు ఉన్నారు.మొత్తం 30 వేల ఎకరాల్లో జీబీసీ ఆయుకట్టు కింద మిర్చి పంటలు సాగు చేస్తున్నారు.మిర్చిపంట సాగు చేయడానికి ఒక ఎకరానికి ఒక లక్ష నుండి, 1,50,000 రూపాయలు పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఈ లెక్కన 450 కోట్ల రూపాయలు పెట్టుబడి ఖర్చు అయినది.జీబీసీ కి నవంబర్ నెలలోనే సాగునీరు బంద్ చేశారన్నారు. రైతులు, రైతు సంఘాలు జీబీసీకి సాగునీరు జనవరి ఆఖరు వరకు కొనసాగిం చాలని ఆందోళన చేసిన అధికారులు స్పందించలేదు. ఫలితంగా రైతులు పంటలు అన్నీ ఎండిపోతున్నాయి అని పేర్కొన్నారు. ఈ తరుణంలో రైతులు తమ పంటలను కాపాడు కోవడానికి ట్యాంకర్లతో ఎద్దుల బండ్లపై పిన్ టిక్స్ ట్యాంకుల ద్వారా తమ పంటలను కాపాడుకోవడానికి సమీపంలో గల కుంటలు, వంకలు, బావులు, చెరువులు, చెక్ డాములలో నిలువ ఉన్న-నీటితో ప్రాణం పోయేవాడి గొంతులో తులసి తీర్థం పోసినట్లు పోస్తున్నారని దుయ్యబట్టారు. పాలక ప్రభుత్వం స్పందించి హెచ్ఎన్ఎస్ఎస్ నుండి 100 క్యూసెక్కుల సాగునీరు జీబీసీ కి వదిలితే రైతులు వేసిన 30 వేల ఎకరాలకు 1తడి ఇస్తే రైతులు పెట్టిన పెట్టుబడి అయిన రైతులకు అందుతుందన్నారు. లేదంటే రైతులకు పురుగుల మందే పెరుగన్నం అవుతుంది.ఇందులో సొంతంగా తమ భూమి సాగు చేసిన వారు, కౌలు డబ్బులు ముందుగా కట్టి సాగు చేసిన రైతులు ఉన్నారు అని తెలిపారు. సాగునీరు వదలక పోతే ఎంత మంది యువ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారో తెలియని పరిస్థితి. గతంలో 2016, 2017 సమయంలో ఇలాంటి పరిస్థితి వస్తే అప్పటి ప్రభుత్వం ఇంద్రావతి గ్రామం దగ్గర హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వకి అధికారులతో, ప్రభుత్వంతో చర్చలు జరిపి హెచ్ ఎన్ ఎస్ఎస్ నుండి జీబీసీ కి సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకున్నది పేర్కొన్నారు. ఈ కాలువ 7కిలోమీటర్లు తవ్వి వంకలు వాగుల ద్వారా జీబీసీ కాలువలోని నీరును విడుదల చేశారు. అయితే 2023న గతంలో మాదిరి తుంగభద్రలో నీరు లేక అర్ధాంతరంగా సాగునీరు బందు చేశారు. ఈ కారణంగా 30 వేల ఎకరాలలో మిర్చి పంట ఎండిపోతున్నది. మా పంటలు కాపాడండి అయ్యా అంటూ రైతులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగిన ప్రయోజనం లేదన్నారు. .చివరికి రైతులు, రాజకీయ పార్టీలు హంద్రీనీవా కాలువ దగ్గర పోలీసుల కాళ్ళు మొక్కిన, రాస్తారోకోలు చేసిన నాయకులపై కేసులు పెట్టినారే తప్ప రైతులకు సాగునీరు ఇవ్వడం లేదన్నారు. హెచ్ ఎన్ ఎస్ ఎస్ ద్వారా రోజు 500 క్యూసెక్కులు సాగునీరు చిత్తూరు వరకు చెరువులు, వంకలు, జలాశయాలు నిలువ చేయడానికి మాత్రమే తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. అందులో కేవలం ఒక్క రోజుకు 100 క్యూసెక్కుల సాగునీరు జీబీసీ కి విడుదల చేస్తే రైతులు పెట్టిన పెట్టుబడి 450 కోట్ల రూపాయలు అయినా రైతులకు అందుతాయి అన్నారు. గతంలో మాదిరిగా నింబగళు వ్యాసాపురం గ్రామ రైతులతో చర్చించి జీబీసీ కాలువకు సాగునీరు ఇవ్వాలని లేని పక్షంలో రైతులతో కలిసి వచ్చే రాజకీయ పార్టీలను రైతు సంఘాలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు.

ప్రజల కోసం పీజేఆర్ ట్రస్ట్

విశాలాంధ్ర-పామిడి: ప్రజలకు నిరంతరం సేవ చేయాలని 2010 ఏప్రిల్ 19న పిజెఆర్ ట్రస్ట్ స్థాపించినప్పటి నుండి గుంతకల్ నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఆ ట్రస్ట్ చైర్మన్ టీడీపీ సీనియర్ నేత పెరుమాళ్ళ జీవానంద రెడ్డి పేర్కొన్నారు. పెరుమాళ్ళ జీవానంద రెడ్డి మాట్లాడుతూ 14 సంవత్సరాల నుండి గుంతకల్ నియోజకవర్గం జిల్లా ఇతర జిల్లాలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నామన్నారు, చలివేంద్రాలు, వేరుశనగ పంపిణీ చేసే చోట రైతన్నలకు అన్న సేవా, ఆలయాలకు అన్న సేవా కార్యక్రమం, వితంతు మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు గ్రంథాల పంపిణీ, విద్య వైద్యం కోసం నిరంతరం ఆర్థిక సహాయాలు, వివాహాలకు పెళ్లి దుస్తులు తాళిబొట్టు మెట్టెలు, క్రీడాకారులకు చేయూత, అత్యవసర కోసం అంబులెన్స్‌లు, మరణించిన వారిని స్మశాన వాటికకు తీసుకెళ్లడానికి కైలాస రథాలు, వివాహాలకు ఉచిత బస్సులు మినరల్ వాటర్ ట్యాంకులు, 2000 మంది ఉపాధి కల్పన కోసం వ్యాలీ గ్రీన్ గార్మెంట్ఇండస్ట్రీ, ఆలయాల నిర్మాణం ఆలయాల మరుమత్తుల కోసం విరాళాలు యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ, వికలాంగులకు ట్రై సైకిళ్లు, కుల మతాలకతీతంగా సేవా కార్యక్రమాలు, గుత్తి పామిడి ప్రభుత్వాసుపత్రులలో రోగులకు ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలకు అన్న సేవా కార్యక్రమం చేస్తున్నామన్నారు

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర- యాడికి: పెద్దవడుగూరు మండల కేంద్రం లోని సీపీఐ కార్యాలయంలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జెండాను సోమవారం ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ నిరంతరం నిరుపేద బడుగు బలహీన వర్గాలు కార్మికులు కూలీలు ప్రజా సమస్యల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ పార్టీ కృషి చేస్తోందన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖలలో ఎర్ర జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్.నారాయణ టౌన్ కార్యదర్శి ఎం.రంగనాయకులు మండల కమిటీ సభ్యులు, హుస్సేన్ పీరా, బీసీ వెంకట్ రెడ్డి,రామయ్య సుధాకర్ గౌడ్, ఆర్ రామాంజనేయులు, ఈ.కిరణ్ వి.శ్రీనివాసరెడ్డి, హమాలీ ఏఐటీయూసీ సభ్యుడు సూరి, మల్లికార్జునయ్య పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనను పంపాలి

విశాలాంధ్ర-పామిడి: మండల పరిధిలోని కత్రిమాల గ్రామంలో బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో తెలుగుదేశం పార్టీ ప్రకటించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే భాగంగా టీడీపీ అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు టీడీపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా ప్రతి ఇంటింటికి తిరుగుతూ మనం చంద్రబాబు నాయుడిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవశ్యకతను, అదే విధంగా సూపర్ సిక్స్ పథకాల ద్వారా వారికి అందే ప్రయోజనాలను తెలియజేశారు. వైసీపీ అరాచక పాలనను ఇంటికి పంపించాలంటే ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేస్తూ తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకోరావాలని దృఢ సంకల్పంతో సీఎంగా చంద్రబాబు నాయుదుని చేద్దామంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీరాములు, హరిప్రసాద్, కేశప్ప, ఓబులయ్య, వంశీ, ముసలిరెడ్డి,దేవరపల్లి మాజీ సర్పంచ్ ప్రతాప్, తిరుపాలు, రామంజి, శీన, నల్లప్ప, మునీంద్ర, ప్రతాప్, చాగంటి గోవిందరాజులు, రామయ్య, నారాయణ, కదిరప్ప, మనోహర్, ఉమానాయక్, రాధా, జానకి, అరుణ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి స్థలం టూరిజం శాఖకు ఇవ్వడం సమంజసం కాదు

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంతపురంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ట్రస్ట్‌కు సంబంధించిన సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ ఆసుపత్రి భూములలో ఒక ఎకరా భూమిని టూరిజం శాఖకు నిర్దేశించినట్లు ఉత్తర్వులు జారీ అయిన సందర్భంగా ఏ.పీ.జి.డి.ఏ. సంఘం అధ్యక్షుడు డా.ఎం.రామస్వామి నాయక్, ఉపాధ్యక్షులు డా. వై.ఎం.ఎస్. ప్రసాద్, కోశాధికారి, డా.జి.హేమలత టూరిజం శాఖకు భూములు ఇస్తున్నట్లు వచ్చిన జీవోను రద్దు చేయాలని, ఆ స్థలం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి మాత్రమే చెందే విధంగా చేయాలని కోరుతూ అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిని కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనంత వెంకట్రాం రెడ్డి ఈ విన్నపానికి సానుకూలంగా స్పందిస్తూ ఆసుపత్రికి కేటాయించిన స్థలాన్ని వేరొక శాఖకు అప్పగించడం జరగదు అని హామీ ఇచ్చారని తెలిపారు. అనంత మెడికల్ కాలేజ్ మరి గవర్నమెంట్ హాస్పిటల్ ట్రస్ట్ కు సంబంధించిన సర్వే నెంబర్ 326-4 భూమిలో ఒక ఎకరా భూమిని టూరిజం డెవలప్మెంట్ కి ఇస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పరిధిలో ఉన్న స్థలములో అత్యధిక అన్ని వసతులు సదుపాయాలు ఉన్నటువంటి ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రభుత్వం జీవో ఎంఎస్ 237 ను 1998లో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడం జరిగింది అని పేర్కొన్నారు . ఆ స్థలంలో నిష్ణాతులైన వైద్యులచే ఎన్నో రకాల వైద్య విభాగాలను మెడికల్ అండ్ సర్జికల్ ఆంకాలజీ బ్లాక్, క్రిటికల్ కేర్ బ్లాక్, క్యాన్సర్ బ్లాక్,యాగ్నస్టిక్ ల్యాబ్, స్కిల్ ల్యాబ్ కట్టడానికి ప్రపోజల్స్ వచ్చాయన్నారు .

క్రిటికల్ కేర్ బ్లాకు కన్స్ట్రక్షన్ జరుగుతూ ఉన్నది. రాయలసీమ జోన్ నుండి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మరియు క్యాన్సర్ ఆసుపత్రికి కు ఎంతోమంది రోగులు వస్తుంటారు అన్నారు. రోగులకు సంబంధించిన అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యం ఇక్కడ అందుబాటులో ఉన్నారన్నారు. ఎంతో అభివృద్ధి చెందుతూ ఉన్న ఆసుపత్రిలో వైద్యానికి సంబంధం లేనటువంటి

టూరిజం శాఖకు ఒక ఎకరా భూమి ఇవ్వడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన స్థలంలో టూరిజం శాఖ ఒక ఎకరా స్థలాన్ని కోరడం చాలా బాధాకరం. ప్రభుత్వ స్థలాలు ఎన్నో ఉన్నాయి దయచేసి వాటిని పరిశీలించి వాటిలో ఆ శాఖకు సంబంధించిన ఏర్పాటు చేసుకుంటే ప్రజలకు మేలు చేసిన వాళ్ళు అవుతారని చెప్పామని వెల్లడించారు.

అంగన్వాడీల దీక్షా శిబిరంలో క్రిస్మస్ కేక్‌కట్ చేసిన మహిళలు

విశాలాంధ్ర-ఉరవకొండ: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన అంగన్వాడీల సమ్మె సోమవారం 14వ రోజు చేరుకుంది. సమ్మె చేస్తున్న దీక్షా శిబిరంలోనే క్రిస్మస్ కేక్‌కట్ చేశారు. రాష్ట్ర ముఖ్యమం త్రికి మంచి బుద్ధి ప్రసాదించి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ప్రార్థనలు చేశారు.వీరి సమ్మెకు సిపిఎంతో పాటు సత్య సాయి వాటర్ సప్లై కార్మికులు కూడా సంపూర్ణ మద్దతు తెలిపి దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి వాటర్ సప్లై యూనియన్ నాయకులు బాలకృష్ణ సీపీఎం నాయకులు రంగారెడ్డి, జ్ఞానమూర్తి, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కరువు బృందం నివేదికను బహిర్గతం చేయండి..

- 28 మండలాల్లో కరువు తాండవిస్తుంటే మూడే గ్రామాలు తిరిగారు..
- తూతూ మంత్రంగా 11 మంది ఐఏఎస్ అధికారులు టీమ్ లీడర్ పంకజ్ యాదవ్ పర్యటన..
- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: జిల్లాలోని 31 మండలాల్లో కరువు తీవ్రంగా తాండవిస్తుంటే ప్రభుత్వం కేవలం 28 మండలాలు మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఏర్పడ్డ కరువు నేపధ్యంలో అన్నమో రామచంద్రా అంటూ రైతులు సొంత గ్రామాలు వదలి ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్ళి పోతున్నారని విచారం వ్యక్తంచేశారు.జిల్లాలోని 31 మండలాల్లో కరువు తాండవిస్తుంటే కేవలం 28 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించి బెలుగుప్ప, బొమ్మనహాల్ ,ఎల్లనూరు మండలాలను వదిలేశారని విమర్శించారు. గత నెల 12 న కేంద్ర కరువు బృందాల్లో 11 మంది ఐఏఎస్ అధికారులు,టీం లీడర్ పంకజ్ యాదవ్ అనంతపురము, సత్యసాయి జిల్లాల్లో పర్యటించి పంటల పరిస్థితిని తూతూ మంత్రంగా అధ్యయనం చేసి రైతులను అయోమయ స్థితికి గురి చేశారని మండిపడ్డారు. ఉమ్మడి జిల్లాలో రాత్రి పూట కేవలం మూడు గ్రామాలు పర్యటన చేసి జిల్లా అంతటా కరువు పరిస్థితిని ఎలా అంచనా వేశారో జిల్లా కలెక్టర్ ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర కరువు బృందం రైతులను ఆదుకోవడానికి ఎటువంటి ప్రతిపాదనలు పంపారు, బాధిత రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారో పత్రికా ముఖంగా తెలియ జేయాలన్నారు.గోరుచుట్టు పై రోకటి పోటులా తుంగభద్ర నుండి మనకు రావలసిన 32.5 టిఎంసిల నీరు ఉన్నపలంగా నవంబర్ మాసంలోనే బంద్ చేయడం దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు. ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని విడపనకల్లు మండలం గుంతకల్ బ్రాంచ్ కెనాల్ ఆయుకట్టు కింద 26 వేల ఎకరాలలో మిర్చి రైతులు సాగు చేశారని ప్రభుత్వం అధికారికంగా తెలియజేసిందని అయితే ఇంకా నాలుగువేల ఎకరాల మిర్చి రైతులు లెక్కకు రాలేదన్నారు. మొత్తం 30 వేల ఎకరాల్లో ఆయుకట్టు కింద మిర్చి పంట సాగు చేస్తున్నారని ఎకరానికి ఒక లక్ష నుండి రూ.1.50 లక్షల పెట్టుబడి పెడుతున్నారని అన్నారు. మొత్తంగా 450 కోట్ల రూపాయలు పెట్టుబడి ఖర్చు అవుతోందని అయితే నవంబర్‌లోనే అధికారులు సాగునీరు బంద్ చేశారని

అసహనం వ్యక్తం చేశారు. గుంతకల్ బ్రాంచ్ కెనాల్ కు జనవరి ఆఖరు వరకు సాగు నీరు కొనసాగించాలని రైతులు, రైతు సంఘాలు ఆందోళనలు చేసినా ఉన్నతాధికారులు స్పందించలేదని విరుచుకు పడ్డారు. ఫలితంగా పంటలన్నీ ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ట్యాంకర్లు , ఎద్దుల బండ్లు పిన్ టిక్స్ ట్యాంకుల ద్వారా కుంటలు, వంకలు, బావులు, చెరువులు, చెక్ డాముల్లో నిలువ ఉన్న నీటితో పంటలను కాపాడుకుంటున్నారని ఏకరువు పెట్టారు. ఈ విషయంపై ఇప్పటికైనా పాలక ప్రభుత్వం స్పందించి హంద్రీ నీవా సుజల స్రవంతి నుండి 100 క్యూసెక్కుల సాగునీరు జీబీసికి వదిలి రైతులు వేసిన 30 వేల ఎకరాలకు ఒక తడి ఇచ్చినట్లైతే రైతులు పెట్టిన పెట్టుబడి అయినా దక్కుతుందని పేర్కొన్నారు. లేనిపక్షంలో రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. 2016, 2017లో ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు అప్పటి ప్రభుత్వం ఇంద్రావతి గ్రామం వద్ద హంద్రీ నీవా కాలువకు సాగు నీరు విడుదల చేసి రైతులను ఆదుకున్నదని గుర్తు చేశారు.7 కిలోమీటర్ల మేర కాలువతవ్వి నీరు విడుదల చేశారన్నారు.అయితే ప్రస్తుతం తుంగభద్రలో నీరు లేక అర్థాంతరంగా సాగునీటిని ఆపేశారని ఘాటుగా విమర్శించారు. దీంతో రైతులు సాగు చేసిన 30 వేల ఎకరాల్లో మిర్చి పంట ఎండిపోతోందని వెంటనే పంటలు కాపాడాలని జాఫర్ డిమాండ్ చేశారు.

110 ఏళ్ల వృద్ధురాలు మృతి..

విశాలాంధ్ర-కూడేరు: అరవకూరు గ్రామానికి పెద్ద దిక్కు అయిన కురుబ బొజ్జమ్మ 110 సంవత్సరాలు అవ్వ మృతి చెందింది. ఈమెకు ఒక కుమారుడు వుండేవాడు.ఆయన పేరు కురుబ సంగన్న . దాదాపు 10 సంవత్సరాల క్రిరతం చనిపోయాడు. ఆ అవ్వ తన మనవరాలుతో ఉండేది. ఒక నెల క్రితం వరకు మంచి ఆరోగ్యంతో ఉండేది. బాగా నడిచి అవ్వపనులు ఆమే చేసుకునేది. నెల రోజుల నుండి అనారోగ్యంతో ఉండి వాంతులు, విరోచనాలుతో బాగులేక ఆదివారం మృతి చెందింది. బొజ్జమ్మ అవ్వ కు 100 సంవత్సరాలు దాటిన తర్వాత వుండే పళ్ళు వుడి పోయి మరల పాలు పళ్లు వచ్చాయి. ఆ పళ్లను గ్రామస్తులు అందరూ చూసి ఆచార్య పడ్డారు. అలాంటి మా గ్రామ పెద్ద అయిన కురుబ బొజ్జమ్మ అవ్వ మా మధ్య లేకపోవడం మాకు చాలా బాధాకరమని గ్రామస్తులు చాలా బాధపడుతున్నారు.

కొనసాగిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల నిరవధిక సమ్మె..

విశాలాంధ్ర-పామిడి: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు సోమవారం నిరవధిక సమ్మెను ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో కొనసాగించారు. అంగన్వాడీ వర్కర్లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలని, గత ఆరు నెలల నుండి పెండింగ్‌లో పెట్టిన సెంటర్ అద్దెలు చెల్లించాలన్నారు. ఆయాల ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలన్నారు. రైతు సంఘం జిల్లా కమిటీ మెంబర్ అనిమిరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ విషయంలో రాజకీయ జోక్యాన్ని నివారించాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం వర్తింపచేయాలన్నారు. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు మహాలక్ష్మి, రామాంజ నమ్మ, రమాదేవి, మండల అంగన్వాడీ వర్కర్స్. హెల్పర్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-పామిడి: స్థానిక షాదీఖానాలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ' ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ డాక్టర్ నల్లపాటి తరుపతి నాయుడు, డాక్టర్ శాంతిప్రియ పేర్కొన్నారు. క్లబ్ కమిటీ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి కంటి ఆపరేషన్లను బెంగళూరు శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయించడం జరుగుతుందన్నారు. వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటిలో శుక్లములు ఉన్న వారికి పరీక్షలు, ఆపరేషన్లు పేదవారికి పూర్తిగా ఆరోగ్య సేవా కార్యక్రమములు ప్రతినెలా నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో కంటి ఆపరేషన్లు అర్హులైన వారికి అదే రోజు లేదా మరుసటి రోజు లయన్స్ క్లబ్ పామిడి వారి సహకారంతో బెంగళూరుకు తీసుకెళ్లి శంకరా కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు కంటి నిపుణుల సలహాలతో, కళ్ళలో ఉచిత లెన్స్ కూడా అమర్చబడునన్నారు. కంటి సమస్యలు కల్గిన చిన్నపిల్లలకు, వికలాంగులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. ఈ శిబిరానికి హాజరౌతున్నవారు ఆధార్, ఓటర్, రేషన్ కార్డుల్లో ఏదైనా ఒక కార్డు జిరాక్స్‌తో పాటు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని రావాలన్నారు. మాస్కులు తప్పనిసరిగా ధరించి రావాలని కోరారు.

గిరిజన శంఖారావం గోడపత్రికల ఆవిష్కరణ...

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

విశాలాంధ్ర-ఉరవకొండ: వచ్చేనెల 7వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే గిరిజన శంఖారావం గోడపత్రికలను సోమవారం అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. గిరిజనులు హక్కుల పరిరక్షణ ధ్యేయంగా కలిసికట్టుగా ముందుకెళ్తే మరింత అభివృద్ధి చెందుతారని చెప్పారు. రాష్ట్రంలోని ఉన్న గిరిజనులు సంకటితమై సభ విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో జివిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జి.మల్లికార్జున నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, రాయలసీమ అధ్యక్షులు భాస్కర్ నాయక్, గోవింద నాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంతో పాటు పల్లెలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏసు ప్రభువును కొలుస్తూ భక్తులు ఆలాపించిన దైవభక్తి గీతాలు, కీర్తనలు అలరించాయి. పాస్టర్లు ఏసుక్రీస్తు జన్మదిన విశిష్టతను వివరించారు. వైసీపీ యువజన జోనల్ అధ్యక్షులు ప్రణయ్ రెడ్డితో పాటు పార్టీ నేతలు చర్చిలకు వెళ్లి కేక్ కట్‌చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యువనేత ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ ప్రేమ భావాన్ని, సేవా తత్పరతను, క్షమా గుణాన్ని బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత ప్రీతికరమైన రోజు అని తెలిపారు. ప్రతిఒక్కరూ కూడా ఏసుక్రీస్తు బోధనలను పాటించాలన్నారు.కార్యక్రమంలో ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, జడ్పిటిసి సభ్యులు పార్వతమ్మ, మాజీ జెడ్పిటిసి సభ్యులు తిప్పయ్య ఉప సర్పంచ్ వన్నప్ప, ఏసీ.ఎర్రి స్వామి, వీరితోపాటు తోపాటు చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

శాంతికి సంకేతం క్రీస్తు జననం

విశాలాంధ్ర-బొమ్మనహాల్: క్రీస్తు జననం శాంతికి సంకేతం మనీ తెలుగుదేశం పార్టీ యూత్ నాయకుడు మున్నా అన్నారు. క్రైస్తవులు అతిపెద్ద పండుగ క్రిస్మస్‌ను సోమవారం క్రిస్టియన్ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గోవిందవాడ, బొమ్మనహళ్, ఉద్దేహళ్ తదితరు గ్రామాల్లోని క్రిస్టియన్ సోదరులు చర్చిలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు సాంస్కృతిక కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో కేక్‌కట్ చేసి మిఠాయిల పంచారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 26, డిసెంబర్ 2023

సీపీఐ స్థూపాన్ని ఆవిష్కరించిన జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

-కమ్యూనిస్టు పార్టీకి వన్నెతెచ్చిన ఎర్ర సూరీడు ఐదుకల్లు సదాశివన్

- ఆయన పేరుపై కాలనీ ఏర్పాటు చేయడం సంతోషదాయకం..

-కుల వివక్షత, అణగారిన వర్గాల అణచివేతపై దండయాత్ర చేసిన మహనీయుడని కితాబు

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్(లేపాక్షి): లేపాక్షి మండలం కంచిసముద్రం పంచాయితీ ఐదుకల్లు సదాశివన్ నగర్ కాలనీలో సోమవారం సిపిఐ స్థూపావిష్కరణ సభ మండల కార్యదర్శి టి.శివప్ప అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ హాజరై మాట్లాడుతూ ఐదుకల్లు సదాశివన్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరిని, ఎన్నోసార్లు జైలు జీవితాన్ని గడిపి దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని, ఆనాటి హిందూపురం ఎమ్మెల్యేగా పనిచేసిన కల్లూరు సుబ్బారావు శిష్యుడుగా అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొని, ఆనాటి స్వాతంత్ర పోరాటంలో గాంధీజీ ఇచ్చిన పిలుపును అమలు చేసి జైలు జీవితం గడిపారని, కమ్యూనిస్టు పార్టీలో చేరి కమ్యూనిస్టు పార్టీకి వన్నెతెచ్చిన ఎర్ర సూరీడు ఐదు కల్లు సదాశివన్ లాంటి వ్యక్తి పేరు మీద కాలనీ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని, కుల వివక్షత పైన, అణగారిన వర్గాల అణచివేత పైన పెద్దఎత్తున దండయాత్ర చేశాడని, భూమి కోసం, భుక్తి కోసం భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాన్ని నడిపి ప్రజలకు భూములు పంచిన చరిత్ర ఆయనదని అలాంటి మహోన్నత వ్యక్తులు నిర్మించిన పార్టీ సిపిఐ అని తెలిపారు. ముఖ్యముగా సదాశివన్ నగర్ ఏర్పాటుకు చేయూతనిచ్చిన ముఖ్యమైన వ్యక్తి సిపిఐ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ అని గుర్తు చేశారు, ప్రస్తుతం రాజకీయంలో ఆరు నెలలు ప్రజల వద్దకు వివిధ నాయకులు విచ్చేసి బూటకపు మాటలు చెప్పి ప్రజలను నమ్మబలికించి ఇంటి పట్టాలిస్తాం ఇల్లు కట్టిస్తాం, రహదారులు ఏర్పాటు చేయిస్తామని వాగ్దానం చేసి దాదాపు నాలుగేళ్ల దాకా ప్రజల వద్దకు వెళ్లక ఇప్పటికే 32 లక్షల మందికి గృహ నిర్మాణాలు వెనుకబడి ఉన్నాయని తెలిసిన విషయమే. ఇలా ఎన్నో ఉచితాలు ఇస్తామని పెండింగ్ పెట్టారు. సిపిఐ పార్టీ ఏర్పడి 99 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా 26వ తేదీన ప్రతి కాలనీలలో, మండలాల్లో ఎర్రజెండాలు ఎగరాలని పిలుపుఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు బాబు, నారాయణరెడ్డి, వెంకటేష్ గోవిందప్ప, మారెప్ప, లేపాక్షి మండల సహాయ కార్యదర్శి గౌతమ్, మంజు, నరసింహులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జి పార్థసారథి

బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పార్థసారథి

విశాలాంధ్ర-గోరంట్ల: పట్టణంలోని బస్టాండ్ సర్కిల్‌లో బీకే.పార్థసారథి ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రచ్చబండ వద్ద ఇంచార్జ్ పార్థసారథి మాట్లాడుతూ ఈ నాలుగున్నర ఏళ్ల పాలనలో దోపిడీ అక్రమాలు అవినీతి దౌర్జన్యాలు కనిపిస్తున్నాయి తప్ప, అభివృద్ధి పూర్తిగా శూన్యంగా మారిందన్నారు. ఏ గ్రామంలో చూసినా వైసీపీ ప్రభుత్వాన్ని ఛీదరించుకునే స్థాయికి వెళ్ళిందంటే పరిపాలన ఏవిధంగా ఉందో స్పష్టంగా అర్థం అవుతుం దన్నారు. అందుకోసమే మనమందరం సమిష్టిగా పోరాటం చేస్తూ వైసిపి ప్రభుత్వ అరాచక పాలనపై చరమగీతం పాడి టిడిపి విజయానికి కృషి చేస్తూ, సీఎంగా చంద్రబాబునాయుడు గెలిపించు కుందామని పిలుపునిచ్చారు. హంద్రీనీవా ద్వారా గోరంట్ల ప్రాంతం లోని చెరువులకు త్రాగునీటిని తప్పనిసరిగా అందిస్తామ న్నారు, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అయితేనే రాష్ట్రంతో పాటు పెనుగొండ నియోజకవర్గంలో పరిశ్రమలు మరిన్ని వస్తాయని తెలిపారు, అదేవిధంగా కియా పరిశ్రమతో ఇప్పటికే వేలాదిమంది కార్మికులకు ఉపాధి అవకాశాలు అందు తున్నాయన్నారు, వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ చూసినా అక్రమాలు అన్యాయాలు జరుగుతున్నాయని ఆరోపించారు,ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, పార్లమెంట్ కార్యదర్శి దేవా నరసింహులు, మైనార్టీ సెల్ సహాయ కార్యదర్శి అజ్మతుల్లా, జిల్లా కార్యదర్శి బీరే వేణుగోపాల్ రాయల్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్, జయరాం శ్రీనివాసులు, నీలకం ఠారెడ్డి, సుబ్బరాయుడు, ఉమర్ ఖాన్,నరేష్ యాదవ్, ఉమా శంకర్, భాస్కర్ రెడ్డి, ఉత్తమరెడ్డి, నరసింహులు, రంగప్ప,వేణుగోపాల్, నరేంద్రరాయల్, జనసేన పార్టీ నాయకులు సురేష్, సంతోష్, వెంకటేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కూచిపూడి కళా వైభవంలో ధర్మవరం కళాకారులు...

విశాలాంధ్ర-ధర్మవరం: తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో ఈ నెల 24వ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ వేడుకలు అంబరాన్ని అంటాయి. సత్యసాయి జిల్లా ధర్మవరంలోని మానస నృత్య కళాకేంద్రం వారి శిష్య బృందం కూచిపూడి నృత్య వైభవం అందరినీ ఆకట్టుకుంది. ఇందులో లలిత నాట్య కళానికేతన్ నాట్యాచార్యులు బాబు బాలాజీ శిష్యులు 12 మంది పాల్గొన్నారు. ఈ గిరీష్ రికార్డ్స్‌ను భారత్ ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించి, దాదాపు 5000 మంది అంతర్జాతీయ స్థాయిలో వివిధ కళా నృత్యకారులు పాల్గొన్నారు. ఇంతటి పెద్ద ఎత్తున మహా బృంద నాట్యం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చేర్చినట్లు ఆరి కర్డ్ ప్రతినిధి తెలిపారు. ఇందులో శ్రీ లలిత నాట్య కళానికేతన్ తరఫున 12 మంది గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సాధించడం మాకెంతో సంతోషాన్నిచ్చిందని గురువు బాబు బాలాజీ తెలిపారు. ఆ 12 మందిలో రామలాలిత్యా, సర్వశ్రీ, హృవేద ప్రజ్ఞ, తను లత, ఉమా ప్రియ, వైష్ణవి, అదిత్రి, జాహ్నవి, లీలా మాధవి, ఉదయశ్రీ, సహస్రాలు చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం బాబు బాలాజీ మాట్లాడుతూ ఈ నృత్య గిన్నిస్ రికార్డు వేడుకల్లో ఒకేసారి 3,782 మంది కళాకారులు ఏడు నిమిషాల పాటు లయబద్ధంగా కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి గిన్నిస్ బుక్‌లో చోటుచేసుకోవడం ఆనందదాయకమని తెలిపారు. ఈ ప్రదర్శన చూపురలను మంత్రముగ్ధులను చేసిందన్నారు. రాష్ట్ర మంత్రులు కృష్ణారావు, సీతక్క ఈ ప్రదర్శనకు వీక్షించి హర్షధ్వనాలు చేశారని తెలిపారు. తదుపరి రిశినాద్ రికార్డును ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో భారత్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీ రమణారావు, అధ్యక్షురాలు లలిత పాల్గొన్నారు. ఈ వేడుకల్లో గురువు మానసతో పాటు శిష్య బృందం సోమశేఖర్, జాహ్నవి, యశస్విని, హేమశ్రీ చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది.

చెవిలో పూలతో వినూత్న నిరసన..

విశాలాంధ్ర-ధర్మవరం: 14 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చెవిలో పూలు పెట్టుకొని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సిఐటియు నాయకులు కలిసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్ని రోజులుగా తాము సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కూడా కుట్టినట్లు లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమని తెలిపారు. సమస్యలకు పరిష్కారం చూపకుండా అణిచివేసే ధోరణికి పాల్పడడం దారుణం అన్నారు. మా సమస్యలు పరిష్కరించేంతవరకు ఎంతటికైనా సిద్ధమని సవాల్ విసిరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ, అయుబ్ ఖాన్, పెద్దన్న, సీపీఎం పట్టణ కార్యదర్శి నాగార్జున, సిఐటియు నాయకులు బాలాజీ, సేక్షావలి, అంగన్వాడి యూనియన్ నాయకులు పోతక్క, దీన, మాంచాలిని దేవి, అనిత, కృష్ణవేణి, భువనేశ్వరి, లలితా పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు రైతు సంఘం సంఘీభావం...

విశాలాంధ్ర-ధర్మవరం: 14 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి. జే.వి.రమణ అన్నారు. సోమవారం సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్వాడీల, హెల్పర్ల, వర్కర్స్‌కు ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీలు ఇచ్చిన నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి తెలంగాణ ప్రభుత్వం కంటే వెయ్యి రూపాయలు అదనంగా మా ప్రభుత్వమే ఇస్తుందని వాగ్దానం చేసి పదవీకాలం పూర్తి కావస్తున్న న్యాయం చేయకపోవడం శోచనీయం అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం అమలు చేయలేదని, గ్రాజువిటీ అమలు చేయలేదని కేంద్ర ప్రభుత్వం అంగన్వాడలకు నిర్వహణకు కేటాయించిన బడ్జెట్లో పూర్తిగా కోత విధిస్తున్నదని మండిపడ్డారు. అంగన్వాడీల సమస్య పరిష్కరించేంతవరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తప్పక సహకార అందిస్తామని తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పలు చర్చిలలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఎర్రగుంటలోని హెరాలీ లైట్ చర్చిలో ఫాస్టర్ రమేష్ బాబు, కాయగూరల మార్కెట్ వీధిలోని ఎస్‌ఐయు చర్చిలోని పాస్టర్ డానియల్, లక్ష్మీ నగర్‌లోని బేతేలు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ సుందర్ సింగ్, రైల్వే స్టేషన్‌లోని ఆర్సీఎం చర్చిలో పాస్టర్ పసల జోసెఫ్, దుర్గానగర్‌లోని ఎల్‌ఈఎఫ్ చర్చిలోని మేషక్ పాస్టర్‌ల ఆధ్వర్యంలో కేకులు కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు ఒకరినొకరు తెలుపుకున్నారు. పాస్టర్లు ఏసుక్రీస్తు జీవితాన్ని తెలిపారు. తదుపరి తేనీరు విందు ఇచ్చారు. యేసు జన్మించిన ఈ దినమును అందరూ పవిత్రంగా జరుపుకుంటారని, క్రీస్తు పుట్టుక సర్వ సృష్టికి పర్వదినమని మనుజ కుమారుడిగా ఆ దేవాది దేవుడే ఈ భూతలం పైకి అరుదెంచిన అపురూప కట్టమని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుంది..

విశాలాంధ్ర-ధర్మవరం: నేటి కాంగ్రెస్ పార్టీ చేనేతల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, ధర్మవరం నియోజక వర్గంలో రంగన్న అశ్వత్థ నారాయణకు చేనేత సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందని, ఇటువంటి వ్యక్తిని ప్రజలు వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కర్ణాటక రాష్ట్రం ఓబీసీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వి.నారాయణశెట్టి తెలిపారు. సోమవారం ధర్మవరం చేరుకొని మర్యాదపూర్వకంగా రంగన్న అశ్వత్థ నారాయణ కలిసి నియోజక వర్గ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తుందని, అందుకే కర్ణాటక తెలంగాణ రాష్ట్రాలలో ఎనలేని భారీ మెజారిటీ సాధించిందని, ఏపీలో కూడా వచ్చే ఎన్నికల్లో తప్పక కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుం దన్నారు. రాష్ట్ర చేనేత అధ్యక్షుడిగా రంగన్న అశ్వత్థ నారాయణన్ను నియమించడం సంతోషించదగ్గ విషయమని వారు తెలిపారు. అనంతరం రంగనా అశ్వత్థ నారాయణ శక్తిని ఘనంగా శాలువాతో సత్కరించారు.

27న విద్యుత్ సమస్యలపై ధర్నా

విశాలాంధ్ర-ధర్మవరం: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విద్యుత్ సమస్యలపై ఈనెల 27న ధర్మవరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, ధర్నా విజయవంతం చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు డిష్ రాజు, అసెంబ్లీ కన్వీనర్ గోపాల్ రెడ్డిలు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దారుణం అన్నారు. పంట చేతికందేలోపే విద్యుత్ సమస్యతో లక్షల్లో రైతులు నష్టపోతున్నారన్నారు. ధర్నా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ నాయకులు గోనుగుంట్ల సూర్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్, జాతీయ కౌన్సిల్ మెంబర్ అంబటి సతీష్‌లు హాజరవుతున్నారని, పెద్దఎత్తున ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కిషన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామియాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు జింక చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని మాధవ నగర్ కెపిటి స్ట్రీట్ చెలిమి వద్ద ఈనెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు శ్రీ సీతారామ లక్ష్మణ పంచముఖ ఆంజనేయ స్వామి ద్వాదశ జ్యోతిర్లింగ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను ఆలయ కమిటీ వారు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మొదటి రోజు సోమవారం ఉదయము సాయంత్రములలో గోపూజ గంగపూజ పుణ్యాహవాచనం కంకణ ధారణ కలశ స్థాపన రుద్రాభిషేకం ఆలయ అర్చకులు నిర్వహించారు. స్వామి వారిని వివిధ పూలతో అలంకరించారు. తదుపరి సాయంత్రం కలసపూజ దీక్ష హెూమాలు జప పారాయణం లాంటి కార్యక్రమాలను సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించడం జరిగిందని ఆలయ గౌరవాధ్యక్షులు గద్దం పార్థసారథి, పల్లెం వేణుగోపాల్, సోలిగాళ్ళ వెంకటేశులు, అధ్యక్షులు బండారు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సుందరేషన్, కార్యదర్శి పామయ్యగారి లక్ష్మీనాత్ తెలిపారు. ఈ వేడుకలు ఈనెల 29వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. చివరిరోజు 29న కలశపూజ ప్రాణ ప్రతిష్ఠ, పంచామృతాభిషేకం, అలంకరణ, అష్టోత్తర నామ పూజలతోపాటు వివిధ హెూమాలు, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులను పొందాలనిఇ కోరారు. కార్యక్రమంలో ఆలయ సహకార దర్శి కోటం హేమంత్ కుమార్, కోశాధికారి వెంకట నరసింహులు, సహా కోశాధికారులు నాగభూషణం, రంగనాయకులతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ మణికంఠుడి బ్రహ్మ రథోత్సవం

పట్టు వస్త్రాలు సమర్పించిన ఆర్డీఓ భాగ్యరేఖ

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: ఓం స్వామియే శరణమయ్యప్ప.. ఓం స్వామియే శరణమయ్యప్ప కరుణించప్ప అయ్యప్ప.. కాపాడప్ప అయ్యప్ప అంటూ అయ్యప్ప మాలధారుల శరణ గోషణలతో మణికంఠుడి బ్రహ్మ రథోత్సవం (తేరు) వేడుక సోమవారం అత్యంత వైభవంగా సాగింది. నవరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకొని ఎం.కొత్తపల్లి బండపై కొలువైన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయాన్ని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ సందర్శించి, శ్రీ మణికంఠ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ గురుస్వామి పచ్చార్ల ఆంజనేయులు నాయుడు స్వామి ప్రత్యేక పూజలు చేసి ఆర్డీఓకు మణికంఠ స్వామి ప్రసాదాలు అందజేశారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం వడ్డివారిపల్లి మీదుగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రథోత్సవం సాగింది. రథం ముందు భక్తులకు అఖండ జ్యోతి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. 11వ మండల పూజ, రథోత్సవ వేడుకకు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలధారులు హాజరయ్యారు రథం ముందు కన్య స్వాములు అయ్యప్ప స్వామి గేయాలకు లయబద్ధంగా నాట్యం చేశారు. శరణాలు వేస్తూ, గేయాలు ఆలపించారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి

- దేశానికి సుపరిపాలన అందించిన మహానేత

- వాజ్‌పేయి జయంతి వేడుకలో నాయకులు కితాబు

విశాలాంధ్ర - అగళి : భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు మొట్టమొదటి జాతీయ అధ్యక్షుడు సుపరిపాలన అందించిన మహా నాయకులు భారతరత్న భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజీపేయి 99 వజన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. మడకశిర పట్టణంలోని సుకన్య ఆసుపత్రి ఆవరణంలో సోమవారం వాజీపేయి చిత్రపటానికి పూలమాల లేసి నివాళులు అర్పించారు. కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. వాజీపేయి భారతదేశానికి మంచి సంస్కరణలు తెచ్చారని కొనియాడారు. భారతరత్న అవార్డు గ్రహీత పోక్రన్లో అణుబాంబు పేలిచ్చి ఇతరదేశాలకు భారత శక్తినిచాటిన గొప్ప నాయకుడు అన్నారు. హైవే లను 6 లైన్ల 4 లైన్గ్ గా స్వర్ణచతుర్భుజిగా అభివృద్ధి చేసిన ఘనత ఆయనదే అన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని మొట్టమొదటిసారిగా బ్యాంకులలో క్రాప్ లోన్ రైతులకు ఇచ్చిన మహనీయుడుగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కేఆర్వి గుప్తా, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రంగే గౌడ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి విక్టోరియారాణి, మండల ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, పట్టణ ఉపాధ్యక్షులు బాను దాస్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు నారాయణప్ప, ఉపాధ్యక్షులు శివరాంరెడ్డి, కేసీ విరుపాక్షి, వికల్ప, నరసింహప్ప, నారాయణప్ప, శ్రీధర్‌రెడ్డి, రామచంద్రగౌడ్, వీరభద్ర, రమేష్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

చెత్త దిబ్బల మధ్య అలనాటి కుట్టు శిక్షణ కేంద్రం

విశాలాంధ్ర-రాయదుర్గం రూరల్: రాయదుర్గం నియోజకవర్గంలో మహిళలకు ఉపాధి కోసం పుర పథకం కింద ప్రారంభించిన కుట్టు శిక్షణ కేంద్రం నేడు చెత్తదిబ్బల మధ్య దీనంగా దర్శనమిస్తోందని మాజీ మంత్రి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50వారాల సెల్ఫీ ఛాలెంజిలో లో భాగంగా రాయదుర్గం పట్టణంలోని కుట్టు శిక్షణ కేంద్రం దుస్థితిపై సోమవారం ఆయన 37వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. రాయదుర్గం గార్మెంట్స్ పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందన్నారు. పూర్వం చేనేత పరిశ్రమను నమ్ముకొని ఇక్కడి ప్రజలు జీవనం సాగించేవారన్నారు. చేనేత పరిశ్రమకు గడ్డు కాలం దాపురించి మగ్గాలన్ని మూతపడిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా దుస్తుల తయారీని ఇక్కడి వారు ఎంచుకున్నారన్నారు. ప్రస్తుతం వేలాది కుటుంబాలు రాయదుర్గంలో దుస్తుల తయారీపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఆరంగంలో మహిళలకు వృత్తి నైపుణ్యం పెంచడంతో పాటు స్వయం ఉపాధి కల్పించాలని పుర పథకం కింద భవనాన్ని గతంలో నిర్మించారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో టాటా సంస్థను ఒప్పించి వారి అధ్వర్యంలో కుట్టు శిక్షణ, దుస్తుల తయారీ కేంద్రాన్ని నిర్వహించామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం నిర్లక్షింగా ఈ కేంద్రాన్ని నాలుగేళ్లు మూసేసిం దన్నారు. తాజాగా ఎమ్మెల్యే "కాపు" ఈ భవనాన్ని ఆయన అనుచరుడికి గోడౌన్‌గా ఉపయోగించుకోవాడనికి ఇచ్చాడని తెలిసిందన్నారు. వేలాది మందికి ఉపయోగపడాల్సిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని "కాపు" తన స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాడని కాలవ ఆరోపించారు. గార్మెంట్స్ కార్మికులపై అతనికి ఏమాత్రం శ్రద్ధ లేదన్నారు. కుట్టు శిక్షణ కేంద్రం అవరణాన్ని చెత్త పాల కులు చెత్తదిబ్బలమయంగా మార్చారని దుయ్యబట్టారు. ఈ చెత్త ప్రభుత్వాన్ని దింపేయడానికి అందరూ ఐకమత్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు ఉంటే నేడు పేద క్రైస్తవులకు 'చంద్రన్న క్రిస్మస్ కానుక' అందేది

- పేదవాడి పొట్ట గొట్టిన.. రద్దుల ప్రభుత్వం వైసీపీది

- రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత

విశాలాంధ్ర-పెనుకొండ: స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం పాత్రికేయులతో ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత మాట్లాడుతూ పండగ పూట పేదలు కూడా సంతోషంగా ఉండాలనే అనే ఆకాంక్షతో ఆనాటి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన, క్రిస్మస్, రంజాన్, సంక్రాంతి కానుకలను రద్దు చేసి, పేదవాడి పొట్టగొట్టిన రద్దుల ప్రభుత్వం వైసీపీది అని మండిపడ్డారు. పండుగల సమయంలో కూడా పేదలకు సంతోషం లేకుండా చేస్తు న్నారన్నారు. పేదలంటే ప్రేమ అని చెబుతున్న జగన్మోహన్‌రెడ్డి పండుగల సందర్భం గా ఇచ్చే కానుకలు ఎందుకు రద్దు చేస్తారన్నారు. చంద్రబాబునాయుడు పేద క్రిస్టి యన్లు క్రిస్మస్ పండుగను జరుపుకోవడానికి టీడీపీ క్రిస్మస్ కానుకను, జెరుసలేం వెళ్లే క్రిస్టియన్ సోదరులకు రూ.50 వేలు ఇచారని గుర్తు చేశారు. క్రిస్టియన్ ద్రోహి జగన్‌రెడ్డి అవన్నీ రద్దు చేసి క్రిస్టియన్ల పొట్టకొట్టాడని అన్నారు.

ఇచ్చిన హామీలే నెరవేర్చమంటున్నాం..

వ్యకాసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగరాణి

విశాలాంధ్ర-చిలమత్తూరు: వ్యకాసం రాష్ట్ర ఉపధ్యక్షులు నాగరాణి, అంగన్వాడీలు కోరారు. గొంతెమ్మ కోర్కెలు కాదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలనే నెరవేర్చమని అడుగుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగరాణి అన్నారు. అమ్మ తర్వత అమ్మలాంటి వారు అంగన్వాడీలు అని భావిభారత పౌరులను బలంగా ఆరోగ్యవంతంగా విజ్ఞానులుగా రూపుదిద్దే ప్రప్రథమ ఘట్టం అంగన్వాడీనే అని అన్నారు. అయితే పాదయాత్ర సందర్భం గా జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ఏమైంది. మహిళలు తమ హక్కుల సాదన కోసం రోడ్డుపైకి వచ్చి 14 రోజులు కావస్తున్నా ముఖ్యమంత్రి నోరు మెదపక పోవడం దారుణం అన్నారు. 13వ రోజున స్వంతంత్రంగా గ్రామాల్లో అంగన్వాడిలకు మద్దతుగా కొవ్వొత్తుల ప్రదర్శన చేయడం సంతోషంగా ఉందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం అంగన్వాడిలకు మద్దతుగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్వాడీలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

చర్చిలో ప్రార్థనలు.. 14వ రోజు సమ్మెలో బాగంగా అంగన్వాడీలు ప్రత్యేకంగా నిరసన తెలియ జేశారు.. ముఖ్యమంత్రికి మంచి బుద్దిని ప్రసాదించి తమ న్యాయమైన కోర్కెలు తీర్చేలా ఆశీర్వదించాలని కోరుతూ చిలమత్తూరు మండల కేంద్రంలోని చర్చ్ లో ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్‌కట్ చేశారు. ఈ కార్య క్రమాలలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ కార్యదర్శి పెద్దన్న,పాల్గొన్న యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల కమిటి శ్రీనివాసులు అంగన్వాడీ యూనియన్ యూనియన్ నాయకులు శోభరాణి, పద్మావతి, వనజ, సునిత, పుణ్యవతి, తోలసి, సీఐటీయూ మండలాధ్యక్షుడు లక్ష్మి నారాయణ, కోషాధి కారి రామచంద్ర, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి చందు, పాల్గొన్నారు.

యేసు ప్రభువా మా సమస్యలు పరిష్కరించు

విశాలాంధ్ర-అగళి : అంగన్వాడీ కార్యకర్తల న్యాయ మైన డిమాండ్లను ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి వెం టనే పరిష్కరించేలా జగన్‌కు బుద్ధి ప్రసాదించాలని అంగ న్వాడీ కార్యకర్తలు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యా లయం ఎదుట క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని కేక్‌కట్ చేసి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే జీతం రూ 1.000 అదనంగా ఇస్తానని ఇచ్చిన హామీని జగన్మోహన్‌రెడ్డి గుర్తు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమం లో వెంకమ్మ, జయమ్మ, రమామణి, శిల్ప, నరసమ్మ, భాగ్యమ్మ రంగమ్మ, రమాదేవి, అనిత లక్ష్మి శ్రీదేవి,సుధారాణి,లక్ష్మీ, మంజమ్మ, పుట్టతాయమ్మ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 26, డిసెంబర్ 2023

అంగన్వాడీలకు మద్దతు తెలిపిన బికె. పార్థసారథి

విశాలాంధ్ర-గోరంట్ల: సోమందేపల్లి ప్రాజెక్టు పరిధిలోని గోరంట్ల మండల కేంద్రంలో అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు 14వ రోజు సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు, అనంతరం తహసిల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ సర్కిల్ వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా వీరికి మాజీ ఎమ్మెల్యే బీకే.పార్థసారథి మద్దతు పలికారు, అలాగే ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, గత ఆరు నెలల నుండి పెండింగ్లో పెట్టిన సెంటర్ అద్దెలు, టిఏ బిల్లులు తక్షణం చెల్లించాలని, ఆయాల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచి, రాజకీయ జోక్యాన్ని నివారించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు, ప్రమోషన్లు కల్పించాలని, ఫేస్ రికగ్నైజేషన్ యాప్ రద్దు చేయాలని, సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, బీమా అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు చెల్లించి, వేతనంలో నగం పెన్షన్ ఇవ్వాలన్నారు.చర్చల పేరుతో కాలయాపన తప్ప సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, పార్లమెంట్ కార్యదర్శి దేవా నరసింహులు,మైనార్టీ సెల్ సహాయ కార్యదర్శి అజ్మతుల్లా, జిల్లా కార్యదర్శి బీరే వేణుగోపాల్ రాయల్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, జయరాం శ్రీనివాసులు, నీలకంఠారెడ్డి,వెంకట రంగారెడ్డి ,సుబ్బరాయుడు, ఉమర్ ఖాన్,నరేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర-ఓ డి సీ రూరల్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ కార్మికులు కోరారు. ముందుగా క్రిస్మస్ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర.కార్యదర్శి. జి.ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్.మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ గ్రాట్యూటీ. సౌకర్యం కల్పించాలని, తక్షణమే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు.

మతాలు వేరైనా మనుషులంతా ఒకటే

విశాలాంధ్ర-పరిగి: మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అని ముస్లిం దంపతులు చాటారు. అయ్యప్ప మాలా దీక్షాపరులకు అన్నదానం చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు. పరిగి మండల కేంద్రంలోని మున్నా కైసర్ దంపతులు అయ్యప్ప స్వామి దీక్షాపరులకు అన్నదానం చేశారు. మలాధారణ చేసిన భక్తులకు దంపతులు ఇద్దరు కలిసి దగ్గరుండి భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా దంపతులు మాట్లాడుతూ ఎన్నో రోజుల నుండి అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదానం చేయాలను కుంటున్నామని, ఆ కోరిక నేడు నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు.

అన్నదానం చేస్తున్న ముస్లిం దంపతులు

వెల్లివిరిసిన క్రిస్మస్ సంబరాలు..

ఆత్మకూరులో..

విశాలాంధ్ర-ఆత్మకూరు: క్రైస్తవుల ప్రధాన పండుగ క్రిస్మస్ ను ఆత్మకూరు మండలంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పరిటాల సునీత కేకులను పలు చర్చిలకు పంపిణీ చేశారు. స్థానిక చర్చికి ఆత్మకూరు మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుపూటి నారాయణస్వామి, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వల్లెపు నాగేంద్ర, యూనిట్ ఇంఛార్జి వెంకటనారాయణ, బీసీ సెల్ కార్యదర్శి రాజారమేష్ ఆత్మకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మయ్య తెలుగు యువత అధ్యక్షుడు అంకె ఆనంద్, వాల్మీకి కందుల ఓబుళపతి తదితర నాయకులు క్రైస్తవ సోదరీసోదరులతో మమేకమై చర్చి పాస్టర్ ఆధ్వర్యంలో కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

రేమా చర్చిలో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని కళాకారుల కాలనీలోని రేమా చర్చిలో ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు మంచి ఆలోచనలతో ప్రతి ఒక్కరికీ శుభం మంచి జరగాలని ఆకాంక్షించారు. అనంతరం ఫాస్టర్ మనీషా, ఎం.నాగరాజు నరసింహులు, అబ్రహాంలు కేక్ కట్ చేసి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. అదేవిధంగా 200 మందికి అన్నదానం చేశారు.

క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం..

కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న నాయకులు

విశాలాంధ్ర- అనంతపురం రూరల్: అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి నగరంలోని సప్తగిరి సర్కిల్‌లోని టౌన్ కాంగ్రి నేషనల్ చర్చ్ తో పాటు తెలుగు యువత నాయకులు బంగినాగ స్వగృహంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్‌కట్ చేసి నగర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఫాదర్ ఆశీస్సులు తీసు కున్నారు. ఏసుప్రభువు జననం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే మతపరమైన సాంస్కృతిక పండుగ క్రిస్మస్ అని, మానవత్వం కోసం జాతి రక్షణ కోసం పరితపించిన ఏసుప్రభువు ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షిం చారు. సమాజంలో కొరవడిన మానవత్వం, అసంతృప్తి, భేదాలు, దేశంలో రాష్ట్రంలో తొలగిపోవాలని ఏసుప్రభువు ఆశీస్సులు అందరిపై ఉండాలని, కోరుకున్నారు. కార్యక్రమంలో దేవుళ్ళ మురళి, ఈటే స్వామిదాస్, సరిపూటి రమణ, గోపాల్‌గౌడ్, దేవదానం, కేపి నారాయణస్వామి, శ్రీరాములు, ముక్తియార్, సైపుద్దీన్, రిషి వర్ధన్, సున్నం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏసు క్రీస్తు సందేశాన్ని ఆచరిద్దాం..

అగాపే ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు...

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ప్రార్థన మందిరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు పాస్టర్ బత్తుల ప్రసాద్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా క్రిస్మస్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, వెంకట నాయుడు, శ్రీనివాసులు హాజరై వారి చేతులమీదుగా కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించారు. ముందుగ పాస్టర్ బత్తుల ప్రసాద్ వారికి ఘన స్వాగతం పలికారు. బొంబాయి రమేష్ నాయుడు మాట్లాడుతూ యేసు క్రీస్తు పుట్టుక ఎంతో మహనీయమని అయన గురించి ఎంతో గొప్పగా మాట్లాడారు. అనంతరం పాస్టర్ బత్తుల ప్రసాద్ ప్రార్థనలు చేసి మాంసాహార విందు ఏర్పాటు చేశారు.

ప్రేమతో క్రీస్తు ప్రపంచాన్ని జయించాడు..

ఎస్పీ అన్బురాజన్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ చర్చిలో సోమ వారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడు కలకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ముఖ్య అతిథి గా పాల్గొని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలి పారు. ఎస్పీ ప్రసంగిస్తూ ఏసు క్రీస్తు ప్రేమతో ప్రపంచాన్ని జయించాడన్నారు. ఆ ఆదర్శాలను స్ఫూర్తిగా చేసుకుని ఇతరుల పట్ల ప్రేమతో స్నేహభావంగా ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా సేవాభావం, ప్రేమ, మానవత్వం కలిగి ఉండి ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, చర్చి ఫాదర్ వినోద్ కుమార్, ఎస్బీ సి.ఐ జాకీర్ హుస్సేన్, సి.ఐ సుబ్బరాయుడు, ఆర్ ఐ రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, సరోజ పాల్గొన్నారు.

శాంతియుత జీవనాన్ని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-అగళి : స్థానిక చర్చిలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలను ప్రతిభ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మానవత్వమే మతం కావాలని లౌకిక భారతదేశంలోని అన్ని కులాలు మతాలు ఒక్కటేనని పాస్టర్లు పేర్కొన్నారు. నమ్మిక గొన్న అందరికీ వారి ఇంట సుఖశాంతులు వెల్లివిరియాలని అన్నారు. ఏ మతమైనా విశ్వశాంతినే కోరుతుందన్నారు. శాంతియుత జీవనమే క్రిస్మస్ సందేశం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు చీరలను పంపిణీ చేశారు. అన్నదానం చేశారు.

పెనుగొండలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-పెనుకొండ: పట్టణంలో సోమవారం క్రిస్మస్ వేడుకలలో ఘనంగా నిర్వహించారు. చర్చిలను రాత్రి నుంచి అలంకరించి ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ క్రిస్మస్ వేడుకలకు అన్ని మతాలవారు పాల్గొనడం విశేషం దర్గా పీఠాధిపతి తాజ్ బాబా, జాబిలి చాంద్ బాషా,

వానవోలు తాండాలో వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల మండలం లోని వానవోలు తాండా గ్రామ పంచాయతీ నందు వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు,ఈ వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం లో బాగంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న ప్రధానమైన 17 పథకాల పైన ప్రజలకు అవగాహన కల్పించారు, ఈ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ది పొందేలా వారికి అవగాహన కల్పించి నిజమైన లబ్ధిదారులను గుర్తించారు,ఈ కార్యక్రమం కు గోరంట్ల మండల అభివృద్ధి అధికారి రఘునాథ్ గుప్త, ఈ ఓ ఆర్ డి. సుధాకర్, వానావోలు తాండా సర్పంచ్ పార్వతి రమణ నాయక్ , ఎంపీటీసీ మునే నాయక్, మండల స్థాయి అధికారులు, వానవోలు పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్లు, బి జి పి నియోజకవర్గ కో ఆర్డినేటర్ శీన మరియు మండల అధ్యక్షులు ఈశ్వర రెడ్డి, సచివాలయం సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, వెలుగు సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

బెలగేర శ్రీరంగనాథస్వామికి ప్రత్యేక పూజలు..

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేంద్రంలోని గొల్లహట్టిలో వెలసిన బిలగేర శ్రీ రంగనాథస్వామి, శ్రీఈరముద్దల్లప్పస్వామి దేవాలయంలో యాదవ కులస్తులు ప్రత్యేక పూజ నిర్వహించి కుంభాభిషేకం, పుట్టివెంట్రుకలు, స్వామి వారికి పాలాభిషేకం ఉంటే అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భం గా గుడికట్టుదేవుడుగా పిలువబడే బెలగేరా శ్రీ రంగనాథ స్వామికి మల్లెకనపల్లి, తాళ్లకెర, మందలపల్లి దీన్నే హట్టి, గందలగుంట, బొమ్మచంద్ర, నక్కనహల్లి, జమ్మలబండ, రామయ్యనహట్టి, గ్రామాలకు చెందిన భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తిప్పన్న, జయప్ప, సన్నరంగప్ప, దిన్నే హాట్టికరి యన్న, పుట్టరాజు, మారన్న, మహాలింగప్ప, తిప్పేస్వామి పాల్గొన్నారు.

స్వామివారికి పూజలు చేస్తున్న నాయకులు, భక్తులు

లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర- యాడికి: మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో కీర్తిశేషులు మాజీ ప్రధానోపాధ్యా యులు సత్యబాబు కుటుంబం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఆశ్రమంలో అన్నదానం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. ప్రతి సంవత్సరం క్రిస్మస్, గుడ్ ఫ్రైడే తదితర పర్వదినాలలో లీలావతి వృద్ధాశ్రమంలో సత్య బాబు కుటుంబం చాలాకాలం నుండి అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు వితరణ...

విశాలాంధ్ర-అమడగూరు: మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరీ దేవి ఆలయంలో అయోధ్య నుండి వచ్చి అక్షింతలను అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం అమడగూరు మండలంలో అన్ని భజన బృందాలకు బిజెపి నాయకులు కార్యకర్తలు వితరణ చేశారు. ఈ అక్షింతలను పది పంచాయతీలలో 30 తేదీ వరకు పూజలు నిర్వహించి, మండలంలోని ప్రతి ఇంటికి అందచేయడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో భజన బృందాలు, బీజేపీ నాయుకులు ఆది నారాయణరెడ్డి, మేకల శ్రీనివాసులు రాము సురేంద్రారెడ్డి సుబ్బిరెడ్డి రఘునాథ్‌రెడ్డి, గంగులప్ప, వేమన్నారాయణ, ఉత్తప్ప, రత్నమ్మ , ఉత్తన్న, రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామ నామస్వరాన్ని ధ్యానించారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే తిప్పేస్వామి

విశాలాంధ్ర-అగళి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి వైయస్సార్ పార్టీ శ్రేణులకు సూచించారు. సోమవారం శ్రీ శని మహాత్ముని దేవాలయం వద్ద పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ మంగళవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరుగు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పార్టీ నాయకులు ప్రత్యేక చొరవ తీసుకొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తొలుత సచివాలయం పరిధిలో కో కో కబడ్డీ వాలీబాల్ క్రికెట్ బ్యాడ్మింటన్ తదితర పోటీలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆవరణంలో నిర్వహిస్తున్నారని ఇదివరకే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులు పోటీలో పాల్గొంటారని ఎమ్మెల్యే తెలిపారు ప్రతి సచివాలయానికి స్పోర్ట్స్ మెటీరియల్ ను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో ప్రైజ్ మనీ బహుమతి అందజేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయదానికి ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు.

నేడు వాహనాల బహిరంగ వేలం..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ సెబ్‌స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరములలో పట్టుబడిన 10 వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యల అనంతరం 27 వ తేదీన బుధవారం ఉదయం 10 గంటలకు సెబ్ స్టేషన్ నందు బహిరంగ వేలము వేయబడునని ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనదలచిన వారు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో పాటు నిర్ణయించిన రుసుము ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సెబ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.

ఏసు ప్రభువా.. జగన్‌కు జ్ఞానోదయం కల్పించు

విశాలాంధ్ర-బొమ్మనహాల్: ఏసుప్రభువా సిఎం జగన్మోహన్రెడ్డి కి జ్ఞానోదయం కల్పించు అని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రార్థనలు చేశారు. అంగన్వాడీ వర్కర్లు సమ్మె లో బాగంగా 14వరోజు సోమవారం బొమ్మనహాళ్ లోని తాహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. క్రిస్మస్ డే సందర్భంగా ప్రార్థనలు చేస్తూ నిరసన తెలిపారు. జగన్ కు జ్ఞానోదయం కల్పించి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లుకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని వేడుకొన్నారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు పార్వతి, కార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బోర్వెల్ సిస్టం ట్యాంక్‌కు భూమిపూజ

విశాలాంధ్ర-ఉరవకొండ: పట్టణంలోని ఎనిమిదవ వార్డు సిపివి నగర్ కాలనీలో రూ.1.20 లక్షలతో ఏర్పాటు చేయనున్న నూతన బోర్వెల్ సిస్టం ట్యాంకు నిర్మాణానికి సోమవారం ఉరవకొండ ఎంపీపీ నరసిం హులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉరవకొండలో మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో త్రాగునీటి ఎద్దడి తీర్చడానికి, ప్రజల అవసరాల కోసం అనేక సిస్టం ట్యాంక్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు కురబ లక్ష్మీదేవి, మాజీ జెడ్పిటిసి సభ్యులు తిప్పయ్య, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు బసవరాజు, ఓబన్న, పచ్చి రవి, ప్రకాష్, పార్టీ నాయకులు అంజి, బీమా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్త చెరువులోనే వాసవి కళ్యాణ మండపంలో బెం గళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిం చారు. ఉదయం నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ వైద్య శిబిరం నిర్వహించారు. 350 మందికి డాక్టర్లు వైద్య చికిత్సలు నిర్వహించగా ఇందులో 170 మంది ఆపరేషన్లకు ఎంపిక అయ్యారు. ఉచిత భోజన సదుపాయం, మెడికల్ స్టోర్ సుబ్రహ్మణ్యం ఏర్పాటు చేశారు.ఎంపికైన వారిని బస్సులో బెంగళూరుకు తరలించారు.

బ్లాక్‌లో గ్యాస్ సిలిండర్లు..

- భారత్ గ్యాస్ ఏజెన్సీల చేతివాటం
- మండిపడుతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-శింగనమల: మండల వ్యాప్తంగా భారత్ గ్యాస్ కనెక్షన్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. గ్యాస్ కావాలంటే వేయికళ్లతో ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. భారత్ గ్యాస్ సరఫరా గార్లదిన్నె నుండి సప్లై చేయాలి. గ్యాస్ ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి, ఏజెన్సీ సమయపాలన పాటించడంలేదని వినియోగదారులు మండిపడు తున్నారు. గార్లదిన్నె నుండి శింగనమలకు 14 కిలోమీటర్లు మాత్రమే ఉన్నది.అయితే గ్యాస్ సప్లై నిర్వహకులకు వినియోగదారుల కడుపు కొట్టి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు, 20 కిలోమీటర్ల లోపల గ్యాస్ సరఫరా చార్జీలు వసూలు చేయకూడదని నిబంధనలు న్నా నిబంధనలను తుంగలో తొక్కి గార్లదిన్నె మండల కేంద్రంలో ఉన్న ఇల్లూరు భారత్ గ్యాస్ గోడౌన్ నుండి సరఫరా అవుతుంది, గ్యాస్ బండి గార్లదిన్నె నుండి మొదలుపెడితే ఒక్కో సిలిండర్ పైన 50 రూపాయల నుండి రెండు వంద రూపాయల వరకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. అధికారులు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని,అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారని, ప్రజలు వాపోతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా సివిల్ సప్లై అధికారులు మిన్న కుండిపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోందని గ్యాస్ వినియోగదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అధిక వసూళ్లను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.